


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

# -146-

**(7 జూన్ 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**వేలం పాట**. వేలం పాట.. ఏది చూచినా వేలం పాటగానే వుంది ప్రపంచంలో.

వ్యక్తులకూ, వస్తువులకూ, విధానాలకూ, సాధనాలకూ, జీవితాలకూ, జీతాలకూ, ఆశయాలకూ ఆత్మీయతలకూ, పదవులకు, ప్రావీణ్యతకూ విలువలు తగ్గిపోవడం వల్ల ప్రతిది వేలం పాటలో పడిందీ కాలంలో

ప్రతిదీ 'ఇస్తా – ఇస్తా ' అంటూ పరుగులు తీయడమే గాని, "ఇస్తారా! దయతలిచి సమర్పిస్తారా?" అని అడిగే వాడు ఎవడూ కనిపించకపోవడం వల్ల వేలం పాటలో పడిపోయినాయి అన్నీ.

ప్రణయంలో వేలం పాటలు ఎక్కువవైనాయి సినిమాలలో తరుచు వినిపించే ప్రియురాలి పాటల్లో సగం పై చిలుకు వేలం పాటలే. ఒక అందగాణ్ణి వెతుక్కుని "ఇస్తా!ఇస్తా" అంటూ అతని వెంట పడటమే జరుగుతూ వుంటుంది సామాన్యంగా.

"అడగందే ఇలా వెంట పడతావేం?" అని అడిగే టీవి హీరోలో కనిపించదు. సామాన్యంగా అసలా అందాన్ని వదులుకోవాలని అనిపిస్తేగా. నిజానికి ఆ అమ్మాయి ముందుగా బైటపడి వెంటపడకపోతే – అంత పని అతగాడే చేసివుండేవాడు అలాంటి అవస్థలు కలిపిస్తారు చాలామందికి ప్రియురాళ్ళు.

"నా మనస్సిచ్చేస్తా! ఏ షరతు లేకుండా ఇచ్చేస్తా. నీకే వయస్సిచ్చేస్తా. వారం, వర్జంతో నిమిత్తం లేకుండా, వంశం, వంగడంతో ప్రమేయం లేకుండా, ఇచ్చేస్తా! ఇచ్చేస్తా. ముమ్మాటికీ ఇచ్చేస్తా అని వేలం పాట ప్రారంభించి ఒకసారి రెండోసారి అని కేకలు పెట్టి మూడోసారి అతడి పేరుకొట్టేస్తుంటే ఇక కావలసిందేం వుంది? కానుకగా స్వీకరించడం తప్ప.

షరతులేని వేలం ఒపాట ఫాడటం దానికి అతగాడు అంగీకరించడం ఇవే డ్యూయెట్లలోని చరణాలు అనే వారి ప్రణయానికి తోరణాలు పాటకోనల్లో "ఆ!ఆ!ఆ వో!వో!వో!" అంటూ రాగాన్ని సాగదీయడాలే వారికి అరణాలు.

ఇలా వేలం పాటలో కొట్టిచేయించుకుని, సభ్యతలకు సున్నాలు చుట్ట వేయించుకుని, స్వర్గసీమకు కొత్త పట్టాలు వేయించుకుని కులుకుతూ, కాలం గడిపే జంటల ఎక్కువవుతున్నారు దేశంలో. ఇది ఒక విధంగా మంచిదే. వేలంలో కాటా వేయించుకున్న వస్తువు పైన మక్కువ ఎక్కువగా వుంటుంది గనుక లోపాలున్నా కుక్కిన పేనుల్లాగా పడివుంటారు.

పూర్వకాలంలో మనదేశంలో వుంటూ వచ్చిన స్వయంవర పద్దతి కూడా ఒక విధమైన వేలంపాటే. కన్నియ వచ్చిన వారందర్నీ చూచి ఒకరి మీద మనస్సు లగ్నం చేసుకుని, సిగ్గులు కురిపిస్తూ దండ మెడలో వేయడం. "ఇస్తా! ఇస్తా నా సర్వస్వం నీకిస్తా. సందేహం లేదు" అని మూగగా గొంతు చించుకోవడమే.

ఆ మూగరాగలే ఈనాడు పెద్ద శ్రుతిలో ఆర్కెస్ట్రా సహితంగా హాయిగా వినిపిస్తున్నాయి వేలం పాటలో కూడా క్రొత్తా సొగసులు వచ్చిపడ్డాయి. అన్ని రంగాలలోలాగానే యిందులో కూడా నవ్యభావనం వుద్భవించింది.

ఈ వేలం పాటలకు కేంద్రాలు ఒక చోట అనికాదు ఎక్కడపడితే అక్కడే కాలేజీలు, హాస్టల్సు, పార్కులు, బస్సు స్టాండులు రోడ్డు జంక్షన్లు ఎక్కడ పడితే అక్కడ ఇవి కొనసాగుతూ వుంటాయి ఎక్కడ ఏ ప్రణయమూర్తి తన సర్వస్వాన్ని వేలాం పాట పాడి వెంటనే  ఎలాటి దస్తావేజుతో సంబంధం లేకుండా పోతుందో తెలుసుకోవడం కష్టం.

"గడవదు యిక కాలం
వేసేస్తా బ్రతుకిక వేలం
మనసే అన్నిటికీ మూలం
అది కనిపించని ఉక్కుగాలం"

ఇలాటి భావనలు ప్రాధాన్యం ఏర్పడుతున్నదీ కాలంలో ప్రణయంలో బలం తగ్గుతున్నదో హెచ్చుతున్నదో తెలుసుకోవడం కష్టం మొత్తానికి వింత వింతగా ముందుకు సాగుతోంది కాలం.

అన్నిటికంటే ప్రణయం బాదర బందీ విషయం గనుక ఆ విషయం ముందుగా ప్రస్తావించాను. అసలు ప్రతి విషయంలోనూ ఇలాంటి  వేలాం పాట పద్దతులే అమలులోకి వస్తున్నాయి.

ఒక్క కుర్రవాడున్నాడంటే ఆ వంశంలో తరతరాలుగా సంపాదించి దాచుకున్న కీర్తి ప్రతిష్టల్ని వీధిలో నాలుగు పూటల్లో వేలాం వేసి  చక్కా వస్తున్నాడు 'ఇదేమిటయ్యా ఇలా చేశావు? వంశ ప్రతిష్టపోతే ఎలా?' అని ఎవరైనా పెద్దలు హెచ్చరిస్తే

"నో దానిదేం వుంది అదంతా వట్టి వోల్డు స్టాక్ దాన్ని తుడిచి వెయ్యడం మంచిది ఇక్ష్వాకుల నాటి మర్యాదలకిప్పుడేం వాల్యూ వుంటుంది. కొద్ది సంవత్సరాలలో దానికి పదిరెట్లు ప్రతిష్ట సంపాదిస్తాను. ఇదంతా ఫ్రెష్ స్టాక్ దీని వాల్యూ వేరు ఏడుతరాల్లో ప్రతిష్ట, ఏడువారాల్లో సంపాదించే 'కెపాసిటీ ' వుంది మన దగ్గిర" అని ఎంతో ధీమాగా మాట్లాడతాడు.

పాపం ఒక గృహస్థు తన కుమారుడు చేస్తున్న అఘాయిత్యాల్ని తలుచుకుని, హృదయంలో కత్తి గుచ్చినంత పని అయి "మా వాడు వంశ ప్రతిష్ట అంతా తీసుకుపోయి బజారులో వేలాం పాట పాడుతున్నాడు. పనికిమాలిన వాళ్ళందరి దగ్గిరా పాటలు కట్టి పాడేస్తున్నాడు" అని గోల పెట్టాడు.

గుంభనంగా వుండటం ఏదైనా పనులు చేసే ఆ విషయం గుప్తంగా దాచడం, ఒకవేళ అవసరం వచ్చి బయటకి చెప్పవలసిన అవసరం వస్తే క్లుప్తంగా చెప్పడం ఇలాటి లక్షణాలన్నీ మృగ్యమై పోతున్నాయి.

ప్రతి విషయంలో ఎగబడటం తెగపడటం, అనవసరంగా ముందుకు పడటం, మూర్చపోవడం ఇవన్నీ ఈనాడు ఎక్కువైనాయి.

అరటికాయలు అమ్మేవాడు "పావలాకి రెండు, ఫస్టుక్లాసు కాయలు" అని అరుస్తున్నాడు. మగపిల్లవాణ్ణి కన్న అదృష్టవంతుడు "పదివేలకు పాట కొట్టేయచ్చనుకోండి ' అని గ్రుక్క తిరగకుండా పాట పాడుతుంటే.

ఈ కాలం పాటల తమాషాలు మరికొన్ని ఇంకోసారి.

Post your comments